# నేను లేని నీవు లేనే లేవులే

అద్దంకి శ్రీదేవి

సాయంసంధ్య. అలవాటు ప్రకారమైతే సావిత్రి తులసి పూజచేసి దీపంవెలిగించే సమయం అది మనసులో ఆసక్తిలేక, శరీరంలో సత్తువలేక మంచం దిగలేదు ఆమె. చేతుల్లో తెరచి పట్టుకున్న భాగవతం మనస్సును ఆకట్టకపోవటంతో కిటికీలో నుంచి బయటకుచూస్తూ పడుకుంది. యేదయితే మనస్సుకు బాధకలిగిస్తుందో దాన్నిగురించే తలంచుకోవటం మానవనైజం. వద్దనుకున్నా శారదనుగురించే ఆలోచిస్తున్నది సావిత్రి

సావిత్రి ఎన్నో పూజలు పునస్కారాలు చేసి, చెట్లకు, పుట్లకు మొక్కి శారదను పొందింది. పెద్ద కులంలోపుట్టి, తల్లిదండ్రిని ధిక్కరించి శారద రామదాననే హరిజన యువకుణ్ణి వివాహం చేసుకున్నది. ఆ షాకుకు తట్టుకోలేని సావిత్రి మంచంపట్టి యిప్పుడిప్పుడే కోలుకొంటూంది.

శారదక్కవచ్చిందమ్మా అంటూ ఉత్సాహంగా పరుగెత్తుకొచ్చాడు బాబు. వాడు శారద తర్వాత పదేళ్ళకు పుట్టాడు. అందుకని తల్లిదగ్గర యెంత వాత్సల్యాన్ని పొందుతున్నాడో అంతకు రెండింతలు శారద దగ్గర పొందేవాడు.

ఒక్కక్షణం సావిత్రి ఆనందంతో తబ్బిబ్బయింది. మరుక్షణమే వేసవి మండుటెండలా ఆమె గుండె మండింది.

రామ్మా! గేటుదగ్గర నిలబడివుంది. లోపలికి పిల్చుకొద్దాం అన్నాడు. తల్లిచెయ్యిపట్టుకు లాగుతూ బాబు.

గుమ్మందాకా వచ్చినదానికి లోపలికి రావటానికి ఆహ్వానం కావాలిట్రా ఇదేమన్నా కొత్తఇల్లా? వస్తుందిలే. రోషంతోపాటు అభిమానం అడ్డువచ్చింది. తల్లి నిర్లక్ష్యానికి బాబు గొంతులో దుఃఖం సుళ్ళుతిరిగింది. అన్నాడు: అక్కరాదమ్మా. వెళ్ళిపోతుంది మళ్ళీఅసలు రానేరాదు.

రాకూడదనే కదురా వెళ్ళిపోయింది. అమ్మా, నాన్నా అవసరం లేదనుకునేగా యిన్నాళ్ళు తొంగి చూడలేదు. అసలెందుకువచ్చిందో కనుక్కురా? డబ్బు కావాలంటే చెక్ బుక్ యిచ్చెయి' నాన్నగారు సంతకాలు పెట్టివుంచారు. నగలుకాని బట్టలుకాని కావాలంటే మేడమీద గదిలో అద్దాల బీరువాలోవున్నాయి. ఇందా ఈ తాళంచెవులియ్యి పుస్తకాలేవన్నా కావాలంటే రీడింగ్ రూము తెరిచేవుంది. తన వస్తువు అనుకున్నది యిక్కడేదయినా ఉన్నదంటే నిరభ్యంతరంగా నిస్సంకోచంగా పట్టుకెళ్ళమను. తనే మనది కానప్పుడు తన వస్తువులు మనకెందుకు? నేనుగాని, మీ నాన్నగారుగాని తన సంతోషానికి అడ్డురామనిచెప్పు.

నువ్వు అక్కను చూడవా అమ్మా?...బాబు దీనంగా అడిగాడు.

"ఎందుకుచూడనురా పిచ్చినాగన్నా', అన్నది సావిత్రి వాడి చెంపలు నిమురుతూ 'యీ మూడు వారాలబట్టీ కళ్ళు కాయలుచేసుకుని యెదురు తెన్నులు చూస్తూనేవున్నాగా. దానికి చూడాలనిపిస్తే, అమ్మ గుర్తుంటే సుమా, ఈ గదిలోకి పిలుచుకురా! బాబిగా బలవంతయేంలేదని చెప్పటం మర్చిపోకు. నాకు తెల్సురా! పిల్లలు పెద్దవాళ్ళయిన తర్వాత తల్లి అవస

రంఉండదు. ఎదిగినపిట్టలు స్వేచ్ఛా, స్వాతంత్ర్యం అంటూ గూడు వదలి ఆకాశంలోకి ఎగురుతాయి. గూటి వెచ్చదనం తల్లి రక్షణ, వాటికి రాను రాను వెగటనిపిస్తాయేమో? అందుకనే చెప్తున్నా శారదను అట్టే యిబ్బంది పెట్టకు.

ఏటండమ్మగోరు. ఓపాలి సిన్నమ్మగోరు యెల్లి పోతూంటే బాబుగోర్కి సాత్రాలు నేర్పుతున్నారు. అంటూ మాటకడ్డొచ్చింది పరుగెత్తుకుంటూ వచ్చిన యెల్లి.

వెళ్ళు, వెళ్ళు! పిల్చిపీటేసి నట్టింట కూర్చోపెట్టి చీర, సారె, పెట్టి పంపుదాం. ఆత్మీయులందర్నీ కాల దన్నుకుని, పదిమందిలోనూ మమ్మల్ని వల్చనచేసి నందుకు గౌరవించి మేళతాళాలతో వూరేగించి మరీ పంపుదాం. అన్నది పీరావేశంతో వూగిపోతూ.

సావిత్రి మర్మ గర్భిత వాక్యాలు యెల్లికి అర్థంకాలేదు. శారదను పిలవాలా వద్దా అన్న సంధి గ్ధంలోపడి తలుపునానుకొని నిలబడింది. ఇదే అదు నన్నట్టు బాబు తుర్రున పరుగెత్తికెళ్ళి శారదనుచెయ్యి పట్టి తీసుకొచ్చాడు. శారద ఆప్యాయంగా తమ్ముణ్ణి పొదివివట్టుకొని అపురూపమైన దాన్నేదో పొందినట్టు తనివితీరనట్టు కళ్లు ఆర్పిప్పలంతేసిచేసి చూస్తోంది.

బాబు అక్కవంక, తల్లి వంక మార్చి మార్చి చూస్తూ అన్నాడు. అమ్మా బావగారు సందుచివర నిలబడ్డారు పిల్చుకరానా?' సావిత్రి కళ్ళెత్తి గదిలో నిలబడ్డ శారదవంక అరక్షణం నిశితంగా చూసి వద్ద న్నట్టు తలాడించింది. గదిలో మరోమనిషి, అందునా ప్రాణ సమానంగా పెంచుకున్న కూతురు నిలబడి ఉందన్న స్పృహే లేనట్టు కిటికీలోంచి కొబ్బరిచెట్ల వంకచూస్తూ కూర్చుంది సావిత్రి. అభిమానం, రోషం కచ్చ పొంగిపొరలుతున్నా ఆ తల్లి హృదయంలో ఒక్క తియ్యని మమత, భావనకందని తృప్తి కద లాడాయి.

నిన్నుచాలా బాధపెట్టి ఉంటానమ్మా! నన్ను క్షమించు అంటూ శారద తల్లిపాదాలను అంటి నమస్కరించింది.

సావిత్రి పాదాలను చటక్కున దగ్గరకు లాక్కుని పందిరిమంచం మీదే ముడుచుకు కూర్చుంది. తెల్లగా పాలిపోయిన చెక్కిళ్ళను ముడ తలుబడ్డ తల్లినుదురును చూస్తూంటే శారదకు ఆపుకో లేనంత దుఃఖం పొర్లుకొచ్చింది. మరింత దగ్గరకొచ్చి మంచంపట్టిమీద కూర్చుంటూ అన్నది. 'అమ్మా, నన్ను క్షమించకున్నా ఆశీర్వదించమ్మా. నీ చల్లని దీవెన లేందే నేను జీవితంలో పైకి రాలేనమ్మా, సుఖంగా వుండలేను.

'వుహూ' సావిత్రి నోరుతెరవకుండానే వెట కరించింది.

నిజమమ్మా, నీ చల్లనిచూపుకోసం మాటకోసం తహతహలాడి పోతున్నాను. శారదా నువ్వేంతప్పు చేయలేదని నువ్వంటే లోకం కోడై కూసినా భరించ గలను. ఒక్కమాటు నాకళ్ళలోకిచూసి నామీదనీకు కోపంలేదని చెప్పమ్మా!

అలాగా?

కాదాఅమ్మా? నిరసనగా అలాగా అనేశావు. ఈ వొక్క సంఘటనలో నీ నా మధ్య బాంధవ్యం తెగి పోవలసిందేనా? నేను నీమీదపెట్టుకున్న ఆశలు, నీ వున్నతాభిప్రాయం మీద వుంచిన నమ్మకం పోర పాటే నంటావా. సావిత్రి విసురుగా అన్నది—నీ మీద పెట్టుకున్న నా ఆశలు నేనెవరితో చెప్పుకోవాలి? నీలో వుంచిన నా నమ్మకం చితికిపోయిందని నేనెవరితో మొరపెట్టుకోవాలి?

గుప్పెటలు బిగించి తననితను సంబాళించుకో లేక విలవిలలాడుతున్న శారద ఇంక భరించలేనట్టు హృదయవిదారకంగా అతిదీనంగా తల్లివైపుచూసి అన్నది. అమ్మా ... అమ్మా.

అమ్మా, అమ్మా అని మేకలా పూరికే అరచి ఆ రెండక్షరాలకూవున్న పవిత్రతను ఆత్మీయతను చెరపబోకు? నాకు చెడ్డవినుగ్గావుంది పడుకోవాలి.

నేను నువ్వు పెంచిన పిల్లనమ్మా! అవహేళన అవమానం భరించలేనమ్మా.

అవును అన్నీ భరించేందుకు నేనున్నానుగామరి ఏడవకు, లే కళ్ళు తుడుచుకో.

ఇలా సూటిపోటి మాటలనకపోతే యింత విష మివ్వరాదా కళ్ళుమూసుకొని గుటుక్కున మింగుతాను

సావిత్రి ఫెళ్ళున నవ్వి అన్నది. ఓసి పిచ్చితల్లీ! నువ్వు పుక్కిట పట్టిందేమిటనుకుంటున్నావు? అమృతమా? కాదమ్మా కాదు. విషంగూడా మనసిచ్చిన వాడు అందించినప్పుడు తియ్యతియ్యగానే ఉంటుంది. నాలికకు తగిలినప్పుడు, గొంతు జారిన తర్వాతనే ప్రాణంపోయేది.

అది నేను మనసారా అందిపుచ్చుకున్న అమృత భాండమమ్మా. మనిషిలో మంచితనం, నిజాయితీ చూసి ఆనందించి ఆస్వాదిస్తున్న మకరందమమ్మా అది. హాలాహలమే అయినా నేను నిశ్చింతగా ఆనందంగా అనుభవిస్తానమ్మా. అయినా ప్రేమించటం తప్పంటావా?

తప్పా? అబ్బే. తప్పెలా అవుతుంది? మనం కుక్కల్ని ప్రేమిస్తామ్, పిల్లల్ని ప్రేమిస్తామ్, అమ్మని ప్రేమిస్తామ్, నాన్నని ప్రేమిస్తామ్, తమ్ముళ్లని ప్రేమిస్తామ్, చెల్లాయిల్ని ప్రేమిస్తామ్, అబ్బాయిల్ని ప్రేమిస్తామ్, అమ్మాయిల్ని ప్రేమిస్తామ్ సర్వం ప్రేమమయంకాదు.

శారద నిస్పృహతో నిరాశగాలేచి నిలబడింది. ఓటమి ఆమె ముఖంలో స్పష్టంగా కనబడుతోంది.

నువ్వు నన్ను క్షమించవని క్షమించలేవని తెల్పమ్మా. కాని ఆదరించి పరామర్శించక పోతావా అన్న ధైర్యంతో వచ్చాను. నేను రావటం పొరపాటని పిస్తోంది వెళ్తానమ్మా.

మంచిది. అప్పుడప్పుడూ వస్తూపోతూవుండు. నాకు మంచి కాలక్షేపంగా వుంటుంది చూసేవాళ్ళకు చూడసొంపుగాను, వినేవాళ్ళకు వినసొంపుగాను వుంటుంది.

అంటే నన్ని యింటిగడప తొక్కద్దనా నీ వుద్దేశం? చెప్పమ్మా. కుంద బద్దలుకొట్టినట్టు చెప్పు నాకీ ముసుగులోగుద్దులాట ప్రాణసంకటంగా వుంది. కుళ్లుతోనిండిన సంఘాన్నిచూసి భయపడి నీవేగుని నువ్వే తెంచుకుంటావన్నమాట. సరే! కానీ,

శారద యెన్నడూలేనంతవుద్రేకంగామాట్లాడింది

సావిత్రమ్మ మాత్రం చెక్కుచెదరకుండా నిమ్మకునీరెత్తినట్టుగాఅన్నది. ఇది నువు పుట్టిపెరిగిన యిల్లు. నువ్వయితే కాదనుకుని వెళ్ళావుగాని, యిల్లు గాని, యింట్లోని మనుషులుగాని తరిమికొట్టలేదు. వస్తే సంతోషిస్తాం, రాకపోతే మరీ సంతోషిస్తాం.

అంతేకాని రమ్మని పిలవ్వన్నమాట.

పిలిస్తేకానీ రావన్నమాట.

ఆహ్వానించకుండా వచ్చినందుకేగా నాకీ అవమానం

సరే నీ బెట్టుసరి నీదగ్గరే పెట్టుకో. ఈ యింటికి చుట్టాల తాకిడి యేంతక్కువలేదు గంటకో బంధువు. నిముషానికో మిత్రుడువచ్చి యేడిపించిన, ముదాయించి మాటలని సతాయించి - మరిపించి వెడుతున్నారు. నాకెవరూ ప్రత్యేకంగా రావాలనిగాని, ఒకరి దగ్గర నుంచి స్వాంతన పొందాలనిగాని ఆర్తిగాలేదు. నేనున్నాను, నాకు నా మనస్థైర్యం వుంది, మరీ అంతగా యేడవాలంటే ముఖం దాచుకునేందుకు మీ నాన్నగారి భుజముంది.

సావిత్రికళ్లలో గూడుకట్టుకున్న అశ్రువులు ఆయకట్ట వదిలిన నదిలా పరుగులు పెడుతున్నాయి.

వెడతానమ్మా!

మంచిది తల్లీ. డబ్బుకావాలంటే బ్లాంకుచెక్కు నాన్నగారి డ్రాయరుమీద వుంది. బట్టలు, నగలు నీ సూటుకేసుల్లో సర్దిపెట్టాను.

మరింక మాటలుభరించలేనట్టు శారద మధ్యలో అందుకుని అన్నది: నేను వాటికోసం రాలేదమ్మా. తరిగిపోని నీ ప్రేమలో తనివితీరా మునకలేద్దామని వచ్చాను.

నా ప్రేమంటే నీకెంత విలువే!

నేనంటే నీకు యిసుమంతయినా విలువలేదు కాని, కనిపెంచి విద్యాబుద్ధులు నేర్పినందుకు నీమీద నాకెనలేని గౌరవమమ్మా అన్నది శారద.

గౌరవంకాదు, కృతజ్ఞతను.

నువ్వింత యీసడించి కొట్టినా, పెదవివిప్పి యెదురు చెప్పలేకపోతున్నానంటే అది నీ పెంపకంలోని గొప్పతనం కాదంటావా? నీమీదున్న అకుంఠిత ప్రేమ కాదంటావా?

అబ్బే! ఎలా కాదంటాను. పెద్దవాళ్ళను యెదిరించి, కానివాణ్ణి కట్టుకునే ధైర్యం నా పెంపకంలోనే అబ్బివుంటుందని గర్విస్తున్నాన్లే! నా పిల్లగాంగా అర్ధరాత్రిపూట కిటికీదూకి పారిపోయి వలచినవాడి వడిలో చోటుచూసుకుందని విర్రవీగుతున్నానే!

అంతేకాని బిడ్డ సుఖపడుతోందని సంతోషించటం లేదన్నమాట.

సుఖంట, సుఖం! నువ్వు నాదగ్గరేం కష్టపడ్డావే ఒక్కగానొక్క ఆడపిల్లవి. ముద్దూముచ్చటా చూసుకుంటూ, నేను నాన్నగారు కంటికిరెప్పలా కాపాడుకున్నాం. చదువు చెప్పించాం, సంగీతం చెప్పించాం, నువు ఆడిందల్లా ఆట, పాడిందల్లా పాట్గా అన్నాం. ఏ తల్లీదండ్రీ, యేబిడ్డ కింతకన్నా యెక్కువచేస్తారే?

ఎక్కువ యెవరూ చెయ్యరమ్మా. కాని నిజంగా పిల్ల మంచికోరేవారైతే, మనసుపడ్డవాడికిచ్చే పెళ్ళి చేసేవారు.

అవును. అడుక్కుతినేవాడికిచ్చి మా చేతులు దులుపుకోలేదనేగా నీకోపం: నిజమే మురికిగుంట నీరు తాగినకప్ప బెకబెకలాడక, రసాల పల్లవాలను తిన్న కోకిలకుమల్లే మధురాతిమధురంగా ఎలా గానం చేస్తుంది నావిచ్చిగాని. అందుకే అన్నారు మేనత్త పోలిక, మేనమామ చాలిక అని.

చచ్చిపోయినవాళ్ళనుగూడా యెందుకంటావులే అమ్మా. అయినా నాజీవితాన్ని నేను మలుచుకుంటూంటే కాదని మీరెందుకు అడ్డుపడాలి? నేనేం చదువుకోనిదాన్నా, ఇంగితజ్ఞానం లేనిదాన్నా, మంచిచెడు నిర్ణయించుకోలేనంతటి పసిదాన్నా.

నిజమేనుకి. నీజీవితాన్ని నువు ముళ్ళకంపలోకి యీడ్చుకుంటూంటే మేం చూస్తూ వూరుకోవాలంటావు. చేతకానివాళ్ళలా చేతులు ముడుచుకోవాలంటావు. నిజమే! లేకపోతే నీ జీవితంమీద మాకేం హక్కుంది? నిన్ను శాసించి మాన్పించే ప్రజ్ఞ మాకెక్కడిది? మేమెవళ్ళం? నీ మానసికస్థితిని మార్చాలని ప్రయత్నించటానికి నీఅంతటిదానివి నువ్వయ్యావు. నీమంచిచెడు చూసుకోగలనేర్పు నీకున్నది. ఆలశ్యంగానైనా తెలియచెప్పావు. చాలాసంతోషం.

నిన్ను బాధపెట్టటం నావుద్దేశ్యం కాదమ్మా. కాని పిల్లలెదిగినతర్వాత వాళ్ళని స్నేహితుల్లా చూసుకోవాలి. వాళ్ళకీ కొన్ని యిష్టాయిష్టాలుంటాయని వ్యక్తిత్వాన్ని నిలుపుకోవటానికి పాటుపడతారని ఆలోచించి అర్థంచేసుకోవాలి. అంతేకాని మనం గుజ్జనగూళ్ళు తినిపించిన పిల్లలు యేదీఆలోచించలేరు, మంచిచెడు తెల్సుకోలేరు అంటూ పెద్దవాళ్ళ ఆశలను భావాలను వాళ్ళనెత్తిన రుద్దకూడదు. బలవంతంచేస్తే నాలానే యెదురుతిరుగుతారు.

18 సంవత్సరాలకే నువ్వింత యెదిగిపోయావని వూహించలేకపోయాను! నీలోయింత ఆత్మాభిమానం వుందనీ తెల్సుకోలేకపోయాను. నా ఆశలు, అభి

మతాలు నీనెత్తినరుద్ది, నీచేత చిలకపలుకుల్లా పరి
కించాలని ప్రయత్నం చేసివుంటే నన్ను క్షమించు.
చిన్నదానివయినా చేతులు పట్టుకుంటాను.

సావిత్రివంటి సంస్కారవతి పొరపాటుగానైనా తన భావాలను మరొకళ్ళచేత ఔననిపించాలనుకోదు. అది శారదకు తెలుసు. తల్లినింత క్షోభ పెట్టినందుకు తన్నితనే నిందించుకుంటూఅన్నది. 'అమ్మా! నువ్వే నన్ను క్షమించాలమ్మా. ఆవేశంలో నే నేదేదో మాట్లాడేశాను. ఈతప్పుకాయి. అసలే అవమానంలో విచారంతో క్రుంగిపోతున్న నిన్ను నా మాటల్తో చిత్రహింస చేశాను. నన్ను కసితీరా తిట్టమ్మా, కొట్టమ్మా. నీకోపం చల్లారేట్టు శపించమ్మా.

నీతులుచెప్పే అధికారమే నాకులేనప్పుడు నిన్ను తిట్టీ, కొట్టే అధికారం నాకెక్కడిది. నువ్విచ్చినా అందివుచ్చుకొనే అహంభావం నాకు లేదులే! నిన్ను కన్నందుకు నాబాధ్యతలు నేను సక్రమంగా నెరవేర్చుకోలేనందుకు లోకానికి సంజాయిషీ చెప్పుకోలేనందుకు, నాలోనేనే దహించుకుపోతున్నాను. మా మానాన మమ్మల్ని బ్రతకనీ. ఎవరంతటి వాళ్ళం అయాం. నాగౌరవం, హోదా నాకున్నాయి. నీప్రేమ మనసు నీకున్నాయి. కాకపోతే మనకు లేందల్లా సుఖం, శాంతి, పరువు, ప్రతిష్ట. ఇవి లేకపోయినా చాలామంది జీవిస్తూనేవున్నారు. నేనూ బ్రతుకుతూనే వున్నాను.

నేనెంత కృతఘ్నురాల్నమ్మా, కన్నతల్లికి సుఖశాంతులు కరువుచేశాను. పరువుప్రతిష్ట కలికంలోకి కూడా రాకుండా చేశాను. నేనుపుట్టంగానే యెందుకు చచ్చిపోలేదమ్మా? నీ కేబాధలు లేకుండా తెరిపిగా వుండేదానివి.

అవును నిజమే! నేనీమధ్య పదేపదే అనుకొంటున్నా నీమాట. తల్లి హృదయంలో చిచ్చుపెట్టే పిల్లలు పుట్టకుండా వుండాలని దేముణ్ణి మరిమరీ ప్రార్థిస్తున్నాను. శారదా! నీకు తెలియదే నేననుభవిస్తున్న రంపపుకోత. నువ్వు వూహించనుగూడా వూహించలేవే. పురిటికందుగా వున్నప్పుడే నీ భవిష్యత్తు గురించి, నీగురించి కమ్మని కలలుగన్నానే. నాకు సాధ్యంకానిపనులు, నాచేతి కందుబాటులోలేని యెన్నోవిద్యలు నువ్వు నేర్చుకోవాలని, నాకుతెల్సిన పదిమంది నిన్నుచూసి ఆశ్చర్యపోవాలని, గౌరవించాలని, మంచిగా చెప్పుకోవాలని తహతహలాడానే! ఒక్కొక్క సంవత్సరం నువ్వు వుంజుకుంటూంటే ఒక్కొక్క ఆశ నాది వమ్మయిపోయిందే. ఎప్పటికప్పుడు సరిపెట్టుకుంటూ వచ్చాను. నా పూజలకు ప్రతిఫల మింతేకాబోలు అని నన్ను నేను సముదాయించుకున్నాను. ఈదఫాకాము మరోమారు నామాట వింటుంది. సక్రమమార్గంలో అందరూ నడిచిన మార్గంలో నడుస్తుంది అనుకుంటూ ఆశపడేదాన్నే! ఇప్పుడిహ అధఃపాతాళానికే కృంగిపోయాను. ఇప్పుడుచెప్పు నిన్ను నేను క్షమించగలనా? నాముద్దు ముచ్చట యేం తీర్చావని ఆదరించనే? ఏమంత గొప్పపనిచేశావని అభినందించను. సంఘంద్రుష్టిలో నీవెంత నీచస్థితికి దిగజారావో తెల్సుకునిగూడా సుఖంగావుంటావని, వుండగలవని ఆశిస్తూ ఆశీర్వదించనే? చురకత్తితో నాగుండె తూట్లుపొడిచావుకదే మూర్ఖురాలా. స్వసుఖం చూసుకునే నువ్వు అమ్మా, నాన్నా యేమయి పోతేనేం అనుకున్నావే. నీ స్వార్థం నువ్వు చూసుకున్నావు. చూడవే నాస్థితిచూడు. ఆ నాటి నుంచి యీ నాటి వరకూ పక్కదిగ లేదు. మీ నాన్నగారు అన్నం నీళ్ల ముట్టటం లేదు. కోర్టుకెళ్లటం లేదు. అవమానంతో క్రుంగి పోతున్నారు. దొంగతనం చేసినట్టు సిగ్గు పడిపోతున్నారు. ఆయన 45 సంవత్సరాల వయస్సులో కంటతడి పెట్టటం మొదటి సారి చూశానే, నువ్వు మాయమయిన రాత్రి భోరున యేడ్చారే! సావిత్రీ నేను బ్రతికుండి ప్రయో

జనమేమిటని యేడ్చారే! వెన్నలాటి మనసు కరిగి ఆవిరై పోయిందే. పరువుప్రతిష్ట గంగలో కల్సిన తర్వాత బ్రతకటం యిష్టంలేక మూడుమాట్లు ఆత్మ హత్యాప్రయత్నంచేశారు. ఆయన అభిమానం ఆత్మ స్థయిర్యం మంచితనం నీతోనే తుడిచిపెట్టుకు పోయాయే! పదేళ్ల పసిపాపడిలా వడిలిపోయారే. తప్పు చేసినవాడికిమల్లే భయంతో, పిరికితనంతో వెర్రిచూపులు చూస్తున్నారే. ఇదే నువ్వు నాకు చేసిన మంచి ఇదే నువ్వు ముట్టచెప్పిన ప్రతిఫలం. నిన్ను నేనెందుకు క్షమించాలే? నువ్వుచేసినతప్పుని నేనెందుకు కాయాలే? నిన్ను నాయింటికి రమ్మని యెందుకు ఆహ్వానించాలే? చెప్పు అంటూ నిల దీసింది.

పశ్చాత్తాపంతో శారద కొంతసేపు మాట్లాడ లేకపోయింది. యేకబిగిని మాట్లాడి సావిత్రి అలిసి పోయింది.

ధైర్యాన్ని బిగబట్టి శారద అన్నది. నాగురించి కూడా కొంచం నువ్వు ఆలోచించమ్మా. పద్దెనిమిది సంవత్సరాలకే హృదయాన్ని పోగొట్టుకుని నిరాశా, నిస్పృహలతో వేరొకమనిషితో అది బావేగాని, యెన్నిసంవత్సరాలు కాపరం చెయ్యగలనమ్మా? అడుగడుక్కీ నన్ను మభ్యపెట్టుకుంటూ బావని మోసం చేస్తూ, రామదాసు ముందు తలవంచుకుంటూ నాజీవితాన్ని నరకప్రాయంచేసుకోలేననుకున్నాను. ప్రాణం మీది తీపి చావక, ఆశలు చంపుకోలేక నాకు వుత్తమ మార్గమనుకున్నదాన్ని యెన్నుకున్నాను. ఇద్దరు మనుష్యులు మనస్ఫూర్తిగా కలిసి జీవించాలని వాంఛించినప్పుడు కులం, మతం అడ్డురావమ్మా? సంఘం! ఈ స్వార్థపూరితమైన సంఘాన్ని చూస్తే నాకెప్పుడూ భయంలేదు, అభిమానంలేదు ఇప్పుడూ లేదు. పిరికివాళ్ళను భయపెట్టి లోబరుచుకోవటం ధైర్యవంతుల్ని మచ్చికచేసుకోవటం తప్ప మన సంఘానికి, సమాజానికి మరోపని లేదు, చేతకాదు. నేను తప్పు చెయ్యలేదనుకున్నంత వరకూ ఎవరికీ తలవంచను నువ్వుచెప్పిన పరువుప్రతిష్ట కల్లబొల్లి మాటలు, డబ్బున్ననాడు మనిషి వ్యక్తిగతంగా బలహీనుడై చెడ్డపనులు చేసినా, నీతిరాహిత్యంగా ప్రవర్తించినా అతగాడి పరువు ప్రతిష్టలు చెక్కుచెదరవు సంఘం అతగాడిని గౌరవిస్తూనేవుంటుంది. నేను బావను పెళ్ళిచేసుకుని రామదాసుతో తిరిగినా సంఘం నన్ను వేలెత్తిచూపెట్టేదికాదు. ఎందుకంటే నీఅండ నాన్నగారిపలుకుబడి మీయిద్దరివెనుక నున్న ఆస్థిఅంతస్థులు నన్ను సర్వదా కాపాడేవి. నన్ను మభ్యపెట్టుకోలేక నా కోరికను అణుచుకోలేక మీకందరికీ ఎదురుతిరిగి ధైర్యంగా నిలబడ్డానుగనక నేను కంటకప్రాయాన్నయాను. నాకుతెల్సు. ఏటికి ఎదురీదేవాణ్ణి నీరు బలంగా అడ్డుకుంటుందని. అందుకే నేను సంఘాన్ని లక్ష్యపెట్టను. నిన్ను నాన్నగారిని కష్టపెట్టినమాటనిజమే! నాస్వార్థం నేను చూసుకున్న మాట యదార్థమే కాని ఒకనరకాన్ని సృష్టించుకుని, ఆసృష్టించుకున్న పరిస్థితుల్ని మనః పూర్వకంగా ఆమోదించలేక కన్న నిన్ను యెదిరించలేని నాపిరికి తనాన్ని తిట్టుకుంటూ కర్మసిద్ధాంతాన్ని వల్లెవేసుకోలేదని నా మీద నీకు కోపం కదమ్మా! క్షణభంగురమైన నీ కోపాన్నయినా భరించగలను గాని, జీవితాంతం నాలో నేను కుమిలిపోతూ బావకోసం చిరునవ్వు నవ్వలేనమ్మా. చచ్చి జీవించటం నావల్ల కాదు నేను కార్చిచ్చులో దగ్ధమైపోతూంటే నువ్వు చూసి భరించగలిగేదానివా అమ్మా? చెప్పు: నీ పరువు-మర్యాద, కులం-మతం, ఆస్థి-అంతస్థు, మంచిపేరు గౌరవం నన్ను సంతోషపెట్టగలిగేవా? బావ అందం అహంకారం మాట చెణుకు నన్ను ప్రలోభపెట్టినా రామదాసు మాటేమిటమ్మా? అతను

చాలా మంచివాడు. మెత్తని మనస్సు, సంస్కారం అతనికి పెట్టనిసంపదలు. నాకు నచ్చినవాడు, నన్ను మెచ్చినవాడు అతన్ని చేసుకున్నందువల్ల వచ్చే కష్టనష్టాలు సుఖదుఃఖాలు బేరీజువేసి చూపి నన్ను బావతో పెళ్లికి వప్పించాలని సహస్రవిధాల ప్రయత్నించాడు. కాని నేను లేని జీవితం అతనికి శూన్యమమ్మా. అతనిలేని నా బ్రతుకు వ్యర్థమమ్మా. నీదృష్టిలో నేను తప్పు చేసివుండచ్చు. కాని నాదృష్టిలో నేనేం చెడుపని చెయ్యలేదు.

నువ్వు చాలా ఎదిగిపోయావే శారదా ?

పిల్లలు ఎదక్కుండా వుంటారామ్మా ? ఎదిగినంతమాత్రంలో తల్లిదండ్రులందు ప్రేమాభిమానాలు తరిగిపోతాయా ?

నిజమేనే శారదా తావిలేని పువ్వు, నేను లేని నీవు లేనెలేవు.

నీ వాత్సల్యంలేని నేను బ్రతకలేనమ్మా అంటూ రెండుచేతులా సావిత్రిమెడచుట్టేసింది. ఆప్యాయత ఆదరణ మమత తొణికిసలాడుతూన్న సావిత్రి శారద తలనిమురుతూ వుండిపోయింది. ఆదేక్షణంలో గుమ్మంలో నిలబడ్డ రామదాసునిచూసి ముఖంచిట్లించకుండా వుందలేకపోయింది.


*With best compliments from :*

# Sree Radhakrishna Stores



**GENERAL MERCHANTS**

**Hotel Dwaraka Bldg., Lakdi-ka-pul**

**HYDERABAD-500004.**

Phone : 37828